# కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

- అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట నేలపాలు
- పరిహారం అందజేయాలని రైతుల వేడుకోలు


ఇబ్రహీంపూర్‌లో నేల వాలిన వరి పంట

చేగుంట(తూప్రాన్): మూడు నెలల పాటు కష్టపడి పండించిన పంటలు ఇటీవల కురిసిన గాలివాన, వడగండ్ల వానకు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంటలు నేలపాలు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మూడు రోజులుగా అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన రైతులకు కునుకు లేకుండా చేస్తోంది. మండలంలోని రెడ్డిపల్లిలో వడగండ్ల వాన, పెద్దశివునూర్, మక్కరాజీపేటలో భారీ వర్షం, ఇబ్రహీంపూర్, బోనాల్ గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రెడ్డిపల్లిలో వడగండ్లకు వరి చేలల్లో ధాన్యం రాలిపోయింది. ఇబ్రహీంపూర్, బోనాల్ గ్రామాల్లో దాదాపు వంద ఎకరాల్లో వరి పంటలు నేలకొరిగాయి. ఇరవై రోజుల క్రితం రాంపూర్, కరీంనగర్ శివారు గ్రామాల్లో ఈదురుగాలుల వానతో మొక్కజొన్న పంట నేలకొరిగి రైతులు నష్టపోయారు. కసాన్‌పల్లి గ్రామంలో వడగండ్ల వానలతో కోత దశలో ఉన్న వరి పంటల్లో ధాన్యం గింజలు నేలపాలయ్యాయి. ఎండా వానలకు ఓర్చుకొని వేలాది రూపాయల పెట్టుబడితో పండించిన పంటలు నేల పాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి బాధిత రైతులకు పరిహారం అందేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు.

### మూడు ఎకరాల పంట నేలపాలైంది



యాసంగి సీజన్‌లో మూడెకరాల్లో వరి పంట సాగు చేశా. ఇటీవల గాలివాన రావడంతో పాల దశలో ఉన్న వరిపంట మొత్తం నేలవాలి పోయింది. వేల రూపాయల పెట్టుబడితో సాగు చేసిన పంట గాలివానకు పాడైపోయింది. అధికారులు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలి.

– కొమ్ము మల్లయ్య, ఇబ్రహీంపూర్

### వివరాలను సేకరిస్తున్నాం



ఇటీవల గాలి వానలతో దెబ్బతిన్న పంటలను గ్రామాల్లో తిరిగి పరిశీలించాం. 33శాతం పంట నష్టం జరిగినట్లు అంచనా వేశాం. పంటల నష్టానికి సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం. అధికారుల ఆదేశాల మేరకు రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.

– (హరిప్రసాద్, మండల వ్యవసాయ అధికారి

## అనుమానితులపై నిఘా పెట్టండి

అధికారులకు బీజేపీ నాయకుల వినతి


ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

పాపన్నపేట(మెదక్): పహల్గామ్ దాడి నేపథ్యంలో గ్రామాల్లోకి వచ్చే అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు బీకొండ రాములు మంగళవారం పాపన్నపేట తహసీల్దార్ సతీష్, ఎస్సై శ్రీనివాస్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. జమ్మూకశ్మీర్ పర్యటనకు వెళ్లిన పర్యాటకులను మత పరంగా వేరు చేసి కాల్చి చంపడం దురదృష్ట కరమన్నారు. ఉగ్రవాదుల మూలాలు దేశం అంతటా వ్యాపించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ క్రమంలో అనుమానిత వ్యక్తులపై దృష్టి పెట్టాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు సంతోష్, దుర్గాప్రసాద్, గౌస్‌పాషా, మల్లెం సత్యనారాయణ, ఇమానియల్, ఆకుల సుధాకర్, భాగేశ్, జగదీశ్, సతీశ్, గణేశ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వలసదారులను పంపించాలి

వినతిపత్రాలు అందేసిన బీజేపీ కార్యకర్తలు


రామాయంపేటలో ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్, పాకిస్తానీయులను గుర్తించి దేశం నుంచి పంపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ మండలశాఖ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ రజనీకుమారి, ఎస్ఐ బాల్‌రాజ్‌కు వినపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మహేశ్వరి, సిద్దరాంలు, శంకర్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో..**

నర్సాపూర్: పట్టణంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీయులను గుర్తించి వెనక్కి పంపాలని బీజేపీ నాయకులు ఆర్‌డీఓ మహిపాల్, సీఐ జాన్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నగేశ్ మాట్లాడారు. ఆయన వెంట నాయకులు రాములు నాయక్, శంకర్, బాల్‌రాజ్, రాంరెడ్డి, నగేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## విదేశీ వలసదారులను అరికట్టాలి

బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్


తహసీల్దార్ వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట(మెదక్): విదేశీ వలసదారులను గుర్తించి వారికి ఆశ్రయం ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని నిజాంపేట బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని తహసీల్దార్ శ్రీనివాస్‌కు, ఎస్ఐ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పహల్గాం దాడి అనంతరం భారతదేశంలో ఉన్న ఇతర దేశస్తులు పాకిస్తాన్, బంగ్లాదేశ్ అక్రమ వలసదారులు ఎవరైనా ఉంటే వారిని గుర్తించి వారి ఇక్కడ నుంచి పంపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు తీగల శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నరేష్ మహంకాళి, ఉపాధ్యక్షుడు సిద్ధరాంరెడ్డి, బూత్ అధ్యక్షుడు పోచయ్య, మహేష్, సందీప్, సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రతీ రైతుకు యూనిక్ కార్డు

- ఏఓ జావిద్
- రేగోడ్ మండలంలో ప్రారంభమైన నమోదు ప్రక్రియ


రైతుల వివరాలను నమోదు చేస్తున్న ఏఓ జావిద్

రేగోడ్(మెదక్): ఆధార్‌తో దేశంలోని ప్రతీ పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతీ రైతుకు ౹రైతు విశిష్ట సంఖ్య౹ ఫార్మర్ యూనీ కోడ్ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందని స్థానిక ఏఓ జావిద్ తెలిపారు. మండలంలోని ఆర్.ఇటిక్యాల, గజ్వాడ, టీ.లింగంపల్లి గ్రామాల్లో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు. భూమి ఉన్న ప్రతీ రైతు తన భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ నిర్మించబడుతుందన్నారు. యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని ఈ రైతులకు ఫార్మర్ ఐడీ కేటాయించనున్నట్లు తెలిపారు. 11 నంబర్లతో కూడిన ఈ గుర్తింపు కార్డు కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఉపయోగపడుతుందన్నారు.

## ఘనంగా రేణుకామాత కల్యాణం


పూజల్లో పాల్గొన్న మైనంపల్లి హనుమంత్ రావు

పాపన్నపేట(మెదక్): మండలంలోని యూసుఫ్‌పేటలో మంగళవారం నిర్వహించిన రేణుకామాత కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పాల్గొన్నారు. అమ్మవారి 30 ఏళ్ల ఆలయ వార్షికోత్సవం, బోనాల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మహిపాల్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూలిన చెట్టును తొలగించిన ప్రయాణికులు


చెట్టును తొలగిస్తున్న ప్రయాణికులు, డ్రైవర్

కోహెడరూరల్(హుస్నాబాద్): ఈదురుగాలులకు రోడ్డుపై కూలిన చెట్టును ఆర్టీసీ డ్రైవర్ చంద్రమౌళి, ప్రయాణికులు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. సోమవారం రాత్రి ఈదురు గాలుల ప్రభావానికి మండలంలోని రాంచంద్రపూర్ నుంచి విజపల్లి వెళ్లే మార్గంలో రోడ్డుకు అడ్డంగా ఒక చెట్టు కూలింది. దీంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. రెండు గ్రామాల పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు.

## సన్నాలకు బదులు మిక్స్‌డ్ బియ్యం పంపిణీ

లబ్ధిదారుల ఆగ్రహం


రజాక్‌పల్లిలో సన్నాలు, దొడ్డు రకం కలిపి ఉన్న బియ్యం

నిజాంపేట(మెదక్): మండల పరిధి రజాక్‌పల్లిలోని రేషన్ దుకాణంలో సన్నాలకు బదులు మిక్స్‌డ్ బియ్యం పంపిణీ చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకానికి డీలర్లు ఆదిలోనే గండికొడుతున్నారని వారు మండిపడ్డారు. మొన్నటిదాక బ్లాక్ మార్కెట్లో దండుకున్న డీలర్లు.. ఇప్పుడు సన్న బియ్యంలో దొడ్డువి కలిపి పంపిణీ చేస్తున్నారన్నారు. మంగళవారం సాయంత్రం పలువురు లబ్దిదారులు రేషన్ షాపునకు వెళ్లి బియ్యాన్ని తీసుకోగా సన్నాలు, దొడ్డు కలిపి కనిపించాయి. ఇదేమిటని ప్రశ్నించిన లబ్ధిదారులకు సివిల్ సప్లై నుంచి వచ్చినవే ఇస్తున్నామంటూ కఠినంగా సమాధానం ఇచ్చారు. వెంటనే అధికారులు స్పందించి సన్నబియ్యం పంపీణీ చేయాలని వారు కోరుతున్నారు.

## సత్యసాయి మందిరంలో మాతృ పూజలు


పులిహోరా ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

రామాయంపేట(మెదక్): భగవాన్ సత్య సాయిబాబా తల్లి ఈశ్వరమ్మ జయంతిని మంగళవారం సత్యసాయి మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకారం, సుప్రభాతం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం అభిషేకం, అష్టోత్తర పూజలు చేశారు. స్థానిక ఆయుర్వేద ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు పులిహోరా ప్యాకెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సాయంత్రం మందిరంలో చిన్నారులు తమ తల్లులను సన్మానించి మాతృ పూజా చేశారు. సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ శంకరయ్య, మహిళా, యూత్ కోఆర్డినేటర్లు భూలక్ష్మి, గౌరీశంకర్, ఇతర ప్రతినిధులు రాజయ్య, భానుశేఖర్, యాదగిరి, పద్మ, సంజయ్, శిరిష పాల్గొన్నారు.

## వైభవంగా వీర బ్రహ్మేంద్రస్వామి జాతర

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి మఠంలో విగ్రహాల ప్రతిష్టాపన, జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం వీర బ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎడ్లబండ్లను ముస్తాబు చేసి బండ్ల ప్రదర్శన చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం


తహసీల్దార్ ఉదయశ్రీకి వినతి పత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): రైతు సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండల పరిధిలో వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, తహసీల్దార్ ఉదయశ్రీకి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించక పోవడం సిగ్గు చేటన్నారు. నష్టపోయిన రైతులకు భరోసా కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### హామీలు విస్మరిస్తున్న కాంగ్రెస్

పాపన్నపేట(మెదక్): అలవి కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేటికీ నెరవేర్చలేదన్నారు. పింఛన్లు రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి మొండి చేయి చూపారన్నారు. కల్యాణలక్ష్మికి తులం బంగారం ఎక్కడ అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

### హమాలీ కొరతను తీర్చండి


ఏఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత ఉందని, తద్వారా కొనుగోలు ప్రక్రియ మండలంలో నత్తనడకన సాగుతోందని సీపీఎం మండల కార్యదర్శి గౌరి అన్నారు. ఈ మేరకు హమాలీల కొరత పరిష్కరించి వేగవంతంగా కొనుగోలు జరపాలని ఏఈఓ వందనకు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి హమాలీ పేరిట అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు.

### రాజిపేటలో ఘనంగా బోనాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేటలో శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఆలయం వార్షికోత్సవాలలో మంగళవారం అమ్మవారికి ఘనంగా బోనాలు తీశారు. ఆలయంవద్ద ఉదయం హోమం నిర్వహించి రేణుకఎల్లమ్మదేవి కళ్యాణం నిర్వహించారు. అనంతరం బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల సందర్భంగా పోతురాజుల విన్యాసం, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నారు.

### నార్సింగి మండల బీజేపీ అధ్యక్షుడుగా చంద్రశేఖర్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల బీజేపీ అధ్యక్షుడుగా శిర్న చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ అధ్యక్షుడిగా పని చేస్తున్న చంద్రశేఖర్ మండల అధ్యక్షుడుగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ ఆశయ సాధనకు కృషి చేస్తానని తెలిపారు.

## క్లుప్తంగా

### బీటీ రోడ్డును నిర్మించండి


అధ్వానంగా గుట్టకిందిపల్లి రోడ్డు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని గుట్టకిందిపల్లి గ్రామంలో ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలంలో గుంతలు ఏర్పడి నడిచేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. 400 మీటర్ల పొడవున ఉన్న ఈ మట్టి రోడ్డును బీటీ వేసి ఇబ్బందులు తీర్చాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

### ధాన్యం తరలింపు వేగవంతం చేయాలి


ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న తహసీల్దార్

పెద్దశంకరంపేట(మెదక్): రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ పీఏసీఎస్, ఐకేపీ సిబ్బందికి, రైస్ మిల్లర్లకు సూచించారు. మంగళవారం పెద్దశంకరంపేట మండలంలో వరి ధాన్యం, జొన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. జొన్న రైతులకు కేటాయించిన గ్రామాల వారీగా ధాన్యం తీసుకొని రావాలన్నారు. దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ రవీందర్ తదితరులున్నారు.

### అమ్మవారికి బోనం


కాద్లూర్‌లో బోనాల ఊరేగింపు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవ వేడుకలో భాగంగా మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపులో శివసత్తుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఇందులో గౌడ సంఘం అధ్యక్షుడు బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు

### దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): రాజీవ్ యువవికాసం సబ్సిడీ రుణాల దరఖాస్తులను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు పరిశీలించారు. మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికాలంగుల సుమారు 1800 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఆయాశాఖల వారీగా వేరుచేయగా స్థానిక బీసీ హాస్టల్ వార్డెన్ ప్రణయ్‌కుమార్‌తోపాటు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ప్రతినిధులు దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తులు చేసుకున్న వారిలో సంబంధిత పత్రాలు జతచేయనట్లయితే లబ్ధిదారునికి సమాచారం ఇచ్చి సరిచేస్తామన్నారు.

### ఫార్మర్ ఐడీ తప్పనిసరి


కొండాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

నర్సాపూర్ రూరల్: ప్రతి రైతూ ఫార్మర్ ఐడీ తీసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మంగళవారం కొండాపూర్, మహ్మదాబాద్ గ్రామాలలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు పద్మశ్రీ, గీత, రంజిత, గాయత్రిలు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయాలని సూచించారు. సాగు యాజమాన్య పద్ధతులను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉండే ఏఈఓల వద్ద రైతులు తమ పాస్‌బుక్‌లతో రిజిస్ట్రేషన్ చేసుకుని కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఫార్మర్ ఐడీని తప్పనిసరిగా పొందాలన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

హవేళిఘణాపూర్(మెదక్): సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చెట్ల నరికివేతతోపాటు ఇతరత్రా పనులు చేపడుతున్నందున బుధవారం కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మెదక్ మండలంలోని ఎస్ఎస్ఎఫ్, ర్యాలమడుగు, మక్తభూపతిపూర్, పాతూరు సబ్‌స్టేషన్లలో అవసరమైన విద్యుత్ తీగలు మరమ్మతులు, చెట్ల నరికివేత, స్తంభాల మార్పులు వంటి పనులు చేయడం జరుగుతుందని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని టి.మాందాపూర్, కొర్విపల్లి, గజగట్లపల్లిలో బుధవారం విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ దినకర్ తెలిపారు. మెదక్ 132 కేవీ విద్యుత్ కేంద్రంలో మరమ్మతులు చేపట్టనున్నామని, అందువల్ల ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**◆ అసైన్డ్ భూములు దళితులకు అందించాలి**

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి గ్రామ శివారులోని 112 సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూములను దళితులకు అందించాలని మాజీ ఉప సర్పంచ్ సంగని సంజీవ్ కోరారు. ఈ భూములను రక్షించి దళితులకు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరడంతోపాటు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దృష్టికి తీసుకుపోయినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ మిర్జాపల్లి, శేరిపల్లి గ్రామాలకు చెందిన కొందరు బీఆర్ఎస్ నాయకులు భూములను చదును చేస్తున్నారని, అధికారులు వెంటనే అసైన్డ్ భూములను మిర్జాపల్లి దళితులకు అందించాలని కోరారు.

**◆ విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు**



నర్సాపూర్: వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాత్రి పట్టణంలో దేవతల విగ్రహాల శోభాయాత్ర చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో వాసవి కన్యకా పరమేశ్వరీ మాత, గణపతి స్వామి, సుబ్రమణ్య స్వామి విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. శోభాయాత్రలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌తో పాటు ఇతర సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**◆ చిలప్‌చెడ్ ఏఈఓగా అనిత**

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ క్లస్టర్ ఏఈఓగా అనిత మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆమె కొల్చారం క్లస్టర్‌లో ఏఈఓగా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం రైతుల యూనిక్ కార్డు ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు.

**◆ బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎల్లారెడ్డి**

చేగుంట(తూప్రాన్): బీజేపీ మండలశాఖ అధ్యక్షుడిగా గొల్లపల్లి మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఎంపీ రఘునందన్‌రావు, మెదక్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, బైరి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**◆ ఆహ్వానపత్రిక అందజేత**



రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామశివారులో ఉన్న పెద్దమ్మ గుడిలో జరిగే కల్యాణోత్సవానికి హాజరు కావాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. 12, 13 తేదీల్లో ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా వారు తిరుపతిరెడ్డిని సన్మానించారు.